ఇంటర్న్‌షిప్ కాలవ్యవధిని తగ్గించండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, మార్చి 4 ప్రభాతవార్త

విదేశాల్లో ఎంబిబిఎస్ చదివి స్వదేశానికి వచ్చే విద్యార్థులకు ప్రస్తుతం అమల్లో ఉన్న రెండేళ్ల ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిని తగ్గించే దిశగా పరిశీలన చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె శాసనసభలో మాట్లాడుతూ విదేశాల్లో ఎంబిబిఎస్ చదివే విద్యార్థులకు గతంలో ఒక్క సంవత్సరం ఇంటర్న్‌షిప్ ఉండేదని, దీంతోపాటు గుర్తింపు పొందిన విద్యాసంస్థల నుంచి అర్హత ప్రమాణ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే మన దేశంలో వైద్య వృత్తిని కొనసాగించే అవకాశాలు ఉండేవని చెప్పారు. కోవిడ్, ఉక్రెయిన్ యుద్ధాల నేపథ్యంలో ప్రస్తుతం ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిని ఒక్క సంవత్సరం నుంచి రెండేళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. కాగా, ప్రస్తుతం పెంచిన రెండేళ్ల ఇంటర్న్‌షిప్ వ్యవధితో విదేశాల్లో ఎంబిబిఎస్‌ను కొంతమంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో చదివారని, దీంతో ఈ రెండేళ్ల ఇంటర్న్‌షిప్‌తో పాటు అర్హత ప్రమాణ పరీక్షలకు సంబం ధించి మరో ఆరు నెలల కాలం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. దీంతో సుమారు మూడేళ్ల పాటు వైద్య వృత్తి కొనసాగించేందుకు వీలు లేదని ఆమె చెప్పారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఎంబిబిఎస్ పూర్తి చేసిన విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిని గతంలోలాగా ఒక్క సంవత్సరం పాటు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మరింత సేవాభావంతో

భక్తులకు సేవలు

టిటిడి ఛైర్మన్ నాయుడు

తిరుమల,మార్చి 4ప్రభాతవార్తప్రతినిధి::

తిరుమలకు శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత బాధ్యతగా సేవాబావంతో సేవలందించేందుకు సత్యసాయిసేవాసంస్థకు చెందిన నలుగురు సభ్యుల బృందం సమగ్రనివేదిక రూపొందించింది. ఈ బృందం మంగళవారం టిటిడి పరిపాలన భవనంలోని ఇఒ శ్యామలరావు ఛాంబర్‌లో నివేదికను అందించారు. శ్రీవారి భక్తులకు మరింత మెరుగైనసేవలందించేందుకు దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణా పరమైన సూచనలను, సలహాలను అమలుచేయాలని రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటనలో ఆదేశించారు. ఇందులో బాగంగా సత్యసాయి సేవాసంస్థలకు చెందిన నలుగురు బృందం రాష్ట్రఅధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు చుండూరి కొమరగిరి శ్యామ్ ప్రసాద్, చుండూరి సురేంద్ర, విశ్వనాథరెడ్డి, ఐదురోజులపాటు తిరుమలలో క్షేత్రస్థాయిలో శాఖలవారీగా పరిశీలించి నివేదికలు తయారుచేశారు. దీన్ని ఇఒకు అందజేశారు. నివేదికలో సేవకులకు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ, సులభంగా రిజిస్ట్రేషన్, క్షేత్రస్థాయిలో శిక్షణ, గ్రామస్థాయిలో ధర్మప్రచారానికి సేవకులతో సమన్వయం వీటితోబాటు శాఖలవారీగా చేపట్టాల్సిన అంశాలను, సౌకర్యాలను నివేదికలో పేర్కొన్నారు.

కన్నుల పండువగా కైలాసనాథుని పల్లకిసేవ

శ్రీకాళహస్తి,మార్చి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి గ్రామోత్సం పల్లకి సేవ. ఈ సేవకు గతంలో ఎంతో ప్రాముఖ్యత ఉండేది. రాను రాను ఉత్సవాలు మొక్కుబడిగా ఊరేగింపులకే పరిమితమౌతున్న దశలో పల్లకి సేవ కూడా స్థానికులకే పరిమితమైంది.

అలిగిన వేళనే చూడాలి . ..

అలిగిన అమ్మవారిని బుజ్జగిస్తూ, ప్రాధేయపడుతూ వెంబడించిన సోమస్కందమూర్తి ఘట్టం భక్తులను ఎంతగానే ఆకట్టుకుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో 12వ రోజు నిర్వహించే గ్రామోత్సవం పల్లకిసేవ. సాధారణంగా ఎవరైనా అలిగితే, కోపబడితే కళ్ళు ఎర్రబడడం సహజం. మోహం ఎర్రగా మారిపోతుంది. అయితే జగన్మాత అసురసంహారిని అయిన ఆదిశక్తి ఆగ్రహించిన వేళ ఆమెను చూడడం ఎవరికైనా సాధ్యమా? సాహసమా? అందుకే అలిగిన ఆదిశక్తి ముందు పల్లకిలో వెళ్ళగా ఆమెను బుజ్జగిస్తూ సోమస్కందమూర్తి అయిన శ్రీకాళహస్తీశ్వరుడు వెంబడించడం పల్లకి సేవ పరమార్థం. ఈ ఘట్టం రమణీయంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరాలయం జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కైలాసనాథుని పల్లకి ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించుటకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో అత్యంత శోభాయమానంగా నిర్వహించే ఉత్సవాల్లో పల్లకి సేవ ఒకటి. ఈ ఉత్సవాన్ని స్థానిక ఉత్సవంగా నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం ఆలయంలోని అలంకార మండపంలో సోమాస్కందమూర్తి అయిన శ్రీకాళహస్తీశ్వరుని ఓ పల్లకిలో ముస్తాబు చేశారు. అలాగే మరో పల్లకిలో దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని చక్కగా అలంకరించి ప్రతిష్టించారు. స్వామి వారి పల్లకిలో అద్దం ఏర్పాటు చేశారు. ముందు స్వామి వారి పల్లకి వెళుతుండగా వెనుక అమ్మవారి పల్లకి సాగింది. అద్దంలో అమ్మవారి తేజస్సును దర్శించుకుంటూ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవాల్లో ఇది చివరి ఉత్సవం కావటంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. బోయిలు స్వామి అమ్మవార్ల పల్లకీల్ని మోసుకుంటూ వెళుతుండగా భక్తులు హారతులిస్తూ ముందుకు సాగించారు. పల్లకిలకు విద్యుత్ దీపాలు పూలతో ముస్తాబు చేశారు. స్వామి అమ్మవార్లను అలంకార గురుకుల్ సూరిబాబులు ముస్తాబు చేయగా ఉత్సవాన్ని ఆలయ ఇఒ బాపిరెడ్డి,ఆలయ , ఇఇ మురళీధర్‌రెడ్డి, డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి డిఇఇ శ్రీనివాసులురెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్, పర్యవేక్షించారు. రాత్రి 9గంటలకు ఆలయం నుంచి స్వామి అమ్మవార్ల పల్లకి ఉత్సవం ప్రారంభం అయ్యింది.

రూ.3.20 కోట్లతో... మాస్టర్‌ప్లాన్ రోడ్డు ప్రారంభం

తిరుచానూరు మెయిన్ రోడ్డు నుంచి పద్మావతి పురం వరకు జరుగుతున్న రహదారి పనులు

తిరుపతి కలెక్టరేట్, మార్చి 4 ప్రభాతవార్త ః

తిరుచానూరు నుంచి తిరుపతికి ఫ్లై ఓవర్ నిర్మించిన తర్వాత ఫ్లై ఓవర్ కింద వెళ్ళే మార్గం ఇరుకుగా మారింది. మార్కెట్ యార్డ్ వద్ద ప్రజలు, వాహన దారులతో నిత్యం రద్దీగా మారింది. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, జిల్లా కలెక్టరేట్, శిల్పారామం, ప్రముఖ హోటల్స్ ఉండడంతో వాహనాల రాక పోకలకు, ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం కోసం పద్మావతి పురం వరకు ఉన్న మాస్టర్ ప్లాన్ రోడ్డును తిరుచానూరు ఫ్లై ఓవర్‌కు అనుసంధానం చేస్తూ తిరుచానూరు పెద్ద చెరువు కట్టకు ఆనుకుని ఉన్న చెరువు స్థలం నిరుపయోగంగా ఉండేది. ఈ విషయాన్ని గుర్తించి టీటీడీ, తుడా అధికారులు పక్కాగా సర్వే చేసి స్థానికులు, ప్రజా ప్రతినిధుల సూచనలు,సహకారంతో రూ. 3.20 కోట్లతో రహదారి నిర్మాణ మార్గాన్ని ప్రారంభించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో కొద్ది రోజులు పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం టీటీడీ ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు పక్కాగా సర్వే ప్రకారం తిరిగి రహదారి నిర్మాణం ప్రారంభించారు. అధికారులు చేసిన సర్వే ప్రకారం కాంట్రాక్టర్ సక్రమంగా పనులు సాగిస్తున్నారు. స్థానిక ప్రజలు కూడా పూర్తి సహకారం అందిస్తున్నారు. ఎక్కడా కూడా ఎలాంటి అవకతవకలు జరగలేదని అధికారులు వివరించారు. గత రెండు రోజులుగా ఓ బడా నాయకుడు అధికారులను, ప్రజలను అందరిని తప్పుదోవ పట్టించడం బాధాకరమని స్థానిక ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు రహదారి నిర్మాణం వలన చెరువుకిగానీ, కాలనీ వాసులకి గానీ,ఎలాంటి ఇబ్బంది లేదని, రోడ్డు నిర్మాణం జరిగితే నిత్యం ప్రజలు, వాహన దారులు రాక పోకలు సాగిస్తుంటే స్థానికులు సురక్షితంగా ఉంటామని హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా రహదారి నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తుడా అధ్యక్షులు మౌర్యను కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు స్థానికులు చెబుతుండం గమనార్హం.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ఆదేశం

పాఠశాలలో మధ్యాహ్నం భోజనం బియ్యం నిల్వలను తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్.

చిత్తూరు రూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ పిల్లలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కింద విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎపి రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. చిత్తూరు రూరల్ మండలం సంక్రాంతిపల్లి గ్రామంలో మంగళవారం ఎపి రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రం, హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హైస్కూల్ ప్లస్‌లో మధ్యాహ్న భోజనంను రుచి చూసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రస్తుతం విద్యార్థులకు పెడ్తున్న గ్రుడ్డు సైజు పెంచి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులు సైతం చదువు పట్ల మక్కువతో విద్యను అభ్యసించాలని, వారు ఉన్నత స్థాయికి చేరుకుంటే తల్లిదండ్రులతో పాటు సమాజం హర్షిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల్లో విద్యార్థులు చదువుతున్న వారి వద్దకు వెళ్ళి పలు ప్రశ్నలు వేశారు. అలాగే పాఠశాలలో నిల్వ వున్న మధ్యాహ్న భోజనం బియ్యం నిల్వలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరహరాల శాఖ అధికారి శంకరన్, మండల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మె ఉధృతం

-వినూతన్న నిరసన

-30వరోజుకు చేరుకున్న జూడాల సమ్మె

తిరుపతి విద్య మార్చి 4 ప్రభాతవార్త

గౌరవ వేతనం పెంచాలంటూ పశువైద్య విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మె నాటికి 30వ రోజుకు చేరుకుంది.ఇందులో భాగంగా మంగళవారం చేతులు, కాళ్లకు స్వతహాగా బేడీలు వేసుకుని న్యాయదేవత ముందు తమగోడును విన్నవించుకుంటూ తమకు ప్రస్తుతం అందిస్తున్న గౌరవవేతనం ఒకవైపు, మరోవైపు ఆకలితీర్చుకునుటకు నిత్యావసరాల ధరల మోతతో వినూత్నంగా నాటికను ప్రదర్శించారు.ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ గత నెల రోజులుగా తరగతులను బహిష్కరించి తమకు న్యాయం చేయాలని రోడ్డెక్కి జూడాలను అధికారులు, ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. తమ ఆకలి కేకలు వర్సిటీ అధికారులు,ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బుధవారం నుంచి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. శాంతియుతంగా నిరసనలు చేస్తూ తమ గోడును అధికారులకు,ప్రభుత్వానికి విన్నవించుకున్నామని స్పందన లేకపోవడంతో సమ్మెను ఉధృతంచేసి రోడ్డుపైకి వచ్చేందుకు సిద్ధమయ్యామని తెలిపారు.

-హాస్టల్స్ బంద్ చేస్తాం...

ఎ ెటర్నరీ జూడాలు సమ్మెను విరమించని నేపథ్యంలో వర్సిటీలోని హాస్టల్స్ ను మూసివేస్తామని మరో వైపు అధికారులు బెదిరిస్తున్నట్లు విద్యార్థులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

నాపై నిందలు తగదు .. నానితో ఫైట్ చెయ్

చెవిరెడ్డి అక్రమాస్తులను ఇంటింటికీ వివరిస్తా..!: పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, మార్చి 4 ప్రభాతవార్త:

చారిత్రాత్మక చంద్రగిరి టవర్ క్లాక్ సెంటర్లో మంగళవారం ఎంఎల్ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి తమ రాజకీయ ప్రత్యర్థి మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. చంద్రగిరి పంచాయతీ ఈఒ మహేశ్వరయ్య ఏసిబి దాడుల్లో పట్టుబడిన నేపథ్యంలో ఎంఎల్ఏ సతీమణి సుధారెడ్డికి రూ.50 లక్షలు ఇచ్చినట్లు చెప్పారని మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డికి సంబంధించిన సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేశారనీ, వార్తలు వ్రాయించారంటూ తీవ్రంగా స్పందించిన ఆమె చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ముఖాముఖీ ప్రెస్ మీట్ పెట్టారు. గతంలో నేను దొంగ ఓట్లపై మాత్రం పోరాటం చేశానని అన్నారు. తనపై నిందారోపణలు చేయడం తగదంటూనే రాజకీయంగా నాభర్త ఎంఎల్ఏ పులివర్తి నానితో ఫైట్ చేయాలే తప్ప మహిళను ఆధారం చేసుకుని వ్యక్తిగత దూషణలు, అసత్యపు ఆరోపణలతో రాజకీయ లబ్దిపొందాలని చూడటం దారుణమన్నారు. నాపై చేసిన ఆరోపణకు సంబంధించిన ఆధారాలను మంగళవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్దకు తీసుకువచ్చి నిరూపించడం ద్వారా నన్ను అవమాన పరచవచ్చని సవాల్ విసిరారు. దశాబ్ద కాలం ఎంఎల్ఏగా పనిచేసిన చెవిరెడ్డి ఓటమితో విచక్షణ కోల్పోయి మితిమీరిన ఆరోపణలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో మహిళలను అవమానించడమే లక్ష్యంగా రాజకీయాలు చేశారని ఎద్దేవా చేశారు. 5 ఏళ్ళలో చెవిరెడ్డి తన కుటుంబం పేరిట దోచుకున్న మఠం భూముల సంగతి తేల్చుతానని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, ఆర్‌సి పురం మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు సింగు సుధ, మొక్కల కుమార్ రాజారెడ్డి, కొండూరు ప్రవీణ్ రాయల్, ఏజి పల్లి బాల, పులికంటి మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించుకోవాలని ఎంఎల్ఏ సతీమణి పులివర్తి సుధారెడ్డి సవాల్ విసరడం పట్ల ప్రెస్‌మీట్‌కు ముందస్తు జాగ్రత్తగా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.

నాయుడుపేటలో విచ్చలవిడిగా

సింగిల్ నెంబర్ లాటరీ జూదం

నిర్వహకుల వేదింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్న యువత

నాయుడుపేట మార్చి 4 ప్రభాతవార్త

నాయుడుపేటలో విచ్చలవిడిగా సింగిల్ నెంబర్ లాటరీ జూదాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్న సంబందిత పోలీసులు పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. నాయుడుపేటలో సుమారు అరవైవేలకుపైగా జనాభా కలిగి దినదిన అభివృద్ధి చెందుతున్న నాయుడుపేట పట్టణంలో పోలీసుల పర్యవేక్షణలోపం నిర్లక్ష్యం కారణంగా ఏదోఒక ప్రాంతంలో అణునిత్యం చోరీలు,జూదాలు జరుగుతున్నాయి. పట్టణంలోని రాజగోపాలపురం, బేరిపేట,అగ్రహారపేట,గాందిమందిరం, పిచ్చిరెడ్డి తోపు, తదితర సెంటర్లులో కొంతమంది నిర్వహకులు సింగిల్ నెంబర్ లాటరీలు,పేకాట,వ్యబిచారం విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా యువత జూదాలకు అలవాటుపడి సింగిల్ నెంబర్ లాటరీల్లో లక్షలు రూపాయలు పోగొట్టుకొని వీదినపడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇందుకు ఉదాహరణ ఓజిలి మండలం కురుగొండ సబ్‌స్టేషన్‌లో లైన్‌మ్యాన్ మురళీకృష్ణ ఆత్మహత్య. నాయుడుపేటలో జరుగుతున్న సింగిల్ నెంబర్ లాటరీలో లక్షలు రూపాయలు పోగొట్టుకొని నిర్వహకుల వేదింపులకు తట్టుకోలేక మసస్థాపం చెందిన లైన్‌మ్యాన్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నాయుడుపేటలో జరుగుతున్న సింగిల్ నెంబర్ లాటరీలు, జూదాలు నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉన్నత స్థానం సాధించేందుకు కలసికట్టుగా కృషి

-తిరుపతి కమిషనర్ మౌర్య పిలుపు

తిరుపతి కార్పొరేషన్, మార్చి 4, ప్రభాతవార్త

స్వచ్ఛ సర్వేక్షన్‌లో తిరుపతి ఉన్నత స్థానం, ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు నగర ప్రజలతో పాటు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది కలసి కట్టుగా కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. తిరుపతి నగరంలో పచ్చదనం పారిశుద్ధం, స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు చేయాల్సిన ప్రణాళికలపై తిరుపతి మహతి ఆడిటోరియంలో నగరపాలక సంస్థ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో మంగళవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పరిశుభ్రత పెంచడంలో మీరు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ప్రజలతో మమేకమై వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తే మరిన్ని ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని, కుటుంబాలను వదిలి పెట్టి పనులు చేస్తున్నారని అన్నారు. ప్రజల సంక్షేమం ఎంత ముఖ్యమో నా కుటుంబ సభ్యులైన మీ సంక్షేమం అంతే ముఖ్యమని అన్నారు. మీ రక్షణ కోసం మేము ఆలోచించి ప్రత్యేక రక్షణ కవచాలు ఇచ్చామని వాటిని వినియోగించాలన్నారు. అంతేకాకుండా ఇన్సూరెన్స్ చేస్తున్నామని, ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నామని అన్నారు. నగరపాలక సంస్థ లోని ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు ఉన్నా మీ పై స్థాయి అధికారులతో పరిష్కారం కాని పక్షంలో నేరుగా నన్ను కలిస్తే తగు న్యాయం చేస్తాను అని హామీ ఇచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ లో తిరుపతి ఉత్తమ ర్యాంకు సాధించాలంటే అందరూ కలసి కట్టుగా పని చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు అందరూ ప్రతి రోజూ విధులకు హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించి మేమున్నాము అనే భరోసాను వారికి కలిగించాలని అన్నారు. మీ అందరికీ తోడుగా మేమున్నాం మీరు నగర శుభ్రతకు, పచ్చదనానికి పెద్ద పీట వేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి తో కృషి చేయాలని అన్నారు. మనం అందరూ కలసి పనిచేస్తే స్వచ్ఛ సర్వేక్షణ్ దేశంలోనే ఉత్తమ ర్యాంకు సాధించడం ఖాయమని అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూఅధికారులు సేతుమాధవ్, రవి, మేనేజర్ హాసీమ్, డి.ఈ.లు, ఏసిపిలు పాల్గొన్నారు.

అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్య

ఓజిలి, మార్చి 4, ప్రభాతవార్త

ఓజిలి మండలం కురుగొండ సబ్ స్టేషన్‌లో లైన్మెన్‌గా పనిచేస్తున్న మురళీ కృష్ణ మంగళవారం సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. నాయుడుపేటలో జరుగుతున్న సింగిల్ నెంబర్ లాటరీల్లో లక్షల రూపాయలు అప్పులు పాలవడంతో లైన్ మాన్ మురళీకృష్ణ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. నాయుడుపేట పట్టణంలో వీధికో సెంటర్లో కొంతమంది సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకులు కొందరు చోటా నాయకుల అండదండలతో సింగిల్ నెంబర్ లాటరీలను నిర్వహిస్తున్నట్లు తెలిసింది.వివిధ పత్రికల్లో వార్తా కథనాలు ప్రచురితం అయినప్పుడు మాత్రమే పోలీసులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటుండడంతో యధావిధిగా సింగిల్ నెంబర్ లాటరీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇకనైనా పోలీసులు లాటరీల నిర్వాహకులపై చర్యలు తీసుకొని జూదాలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

స్టేడియం.. అంబేద్కర్ భవనాలకు 32కోట్లతో ప్రతిపాదనలు

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియం, కుప్పం స్మశాన వాటిక, అంబేద్కర్ భవన నిర్మాణాలకు 32 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు స్థానిక అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు స్థానిక నాయకులతో కలసి స్టేడియం, స్మశాన వాటిక, అంబేద్కర్ భవన్ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్ర మాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, డా॥ వెంకటేష్, నేతలు సత్యేంద్రశేఖర్, కన్నన్, మురుగేష్, మంజు, రవినాయక్, కృష్ణన్, అప్పు, శ్యాంసుందర్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నేతలు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అటవీ ప్రాంతాల్లో పంటలపై దాడులు అరికట్టాలి

ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలోని అటవీ సమీప ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలపై వన్యప్రాణుల దాడులు అరికట్టాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం కంగుందిలో పంటలపై వన్యప్రాణుల దాడుల అంశంగా జిల్లా అటవీ అధికారి భరణి, స్థానిక అటవీ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా పంట పొలాలపై ఏనుగులు, అడవిపందులు, కోతులు దాడులు చేస్తుంటాయని తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. దీనిపై స్పందించిన డిఎఫ్ఒ భరణి మాట్లాడుతూ అటవీ సరిహద్దుల్లో కంచె, కందకాలనిర్మాణాలకు ప్రభుత్వానికి తగు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, ఏరియా ఇన్‌చార్జ్ దివాకర్, సర్పంచ్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లప్పకొండపై వాహనాల రేసింగ్.. సాంస్కృతిక కార్యక్రమాలు

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త

కుప్పం ప్రాంతంలో టూరిజ ం అభివృద్ధి కోసం బుధవారం గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై కుప్పం ఏరి యా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ), ఎపి టూరిజం, డస్ట్ టు క్లౌడ్స్ సంస్థల అధ్వర్యంలో బైక్, కార్ రేసింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కడ కార్యాలయం ప్రకటనలో తెలిపింది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కుప్పంలో ప్రాంతంలోలభించేవివిధ రకాలైన వస్తువుల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కుప్పం ప్రజలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

90 లీటర్ల నాటుసారా స్వాధీనం

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కుప్పం, పలమనేరు ఎక్సైజ్ అధికారుల బృందం రామకుప్పం మండలం రామాపురం తాండా అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. ఈసం దర్భంగా తొంభై లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని విజయ్ నాయక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐలు నాగరాజ, సతీష్, ఎస్సై మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులచే వర్క్‌ఫ్రమ్ హోం సర్వే

శాంతిపురం, మార్చి 4 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 18-50 ఏళ్లలోపు వయసు గల వారు ఇళ్లనుంచే పనులు చేసుకునేందుకు గాను ఎంపిడిఒ పిఆర్ కుమార్ అధ్వర్యంలో కొలమడుగు పంచాయతీలో ఇంటి ంటి సర్వే చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే జాబితా ఆధారంగా ప్రజల విద్యార్హతలను బట్టి వారికి ప్రభుత్వం ఉపాధి కల్పనకై తగు ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందన్నారు. కాగా పంచాయతీలోని రామాపురం, బెండంపల్లి, కడపల్లి పంచాయతీ పోడుచేన్లులో మంచినీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ఎంపిడిఒను కోరారు. దీనిపై ఆయన స్పందించి కొత్త బోర్లు, మోటార్ల ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు.

ఘనంగా శ్రీ ప్రసన్న ఉబ్బమ్మ దేవర .. హాజరైన ప్రముఖులు

కుప్పం, మార్చి 4 ప్రభాతవార్త రజక కులస్తుల ఇలవేల్పు శ్రీ ప్రసన్న ఉబ్బమ్మ అమ్మవారి దేవరను కుప్పంలో రజక కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి రజక కులస్తులు ఈదేవరకు విచ్చేసి అమ్మవారిని దర్శి ంచుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక పాతపేట బైపాస్ రోడ్ సమీపంలో ఉన్న శ్రీ ఉబ్బమ్మ ఆలయం ఉదయం నుంచి రాత్రి వరకు సందడిగా కన్పించింది. ఉదయం నాగమ్మ అమ్మవారికి అభిషేకం, చిన్నగంగమ్మ ఆలయంలో పూజ, గంగపూజ, మధ్యాహ్నం ఉబ్బదేవర పూజ నిర్వహించారు. ఆలయ సమీపంలో నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరిపారు. ఈసందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి పొంగళ్లు, దీపారాధన చేపట్టారు. సాయంత్రం బాణా సంచా పేలుళ్ల మధ్య అమ్మవారిని జలాధివాసానికి తరలించారు. కాగా అమ్మవారిని ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య దొరస్వామి, ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, సలహాదారు నరేష్‌చారి, సిఎం పిఎ మనోహర్, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, డా॥ వెంకటేష్, ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, డా॥ ఆశాజ్యోతి, రాష్ట్ర రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు సి.ఆర్.మోహన్, రాష్ట్ర రజక సంఘం నేతలు షణ్ముగం,కరాటే చంద్ర, మదన్‌మోహన్ తదితరులు దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్కుగం, కౌన్సిలర్లు ఎంఆర్ సురేష్, సోమశేఖర్,సోము, మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, స్థానిక రజక సంఘం నాయకులు రంగనాథ్, కొటావూరు కన్నన్, దయాకర్, నరేష్, మహిళా నేత రత్నమ్మ,రాణి, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే

గుడిపాల, మార్చి 4 ప్రభాతవార్త:

గుడిపాల మండల పరిధిలో ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా చేయడమే ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు లక్ష్యమని ఆయన తండ్రి జిజెఎం ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు పేర్కొన్నారు. జిజెఎం ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు మంగళవారం రామభద్రాపురం పంచాయతీ ముట్టుకురపల్లి గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చడానికి కొత్త బోర్‌ను డ్రిల్ చేసే కార్యక్రమంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తన తనయుడు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, ఉప సర్పంచ్ సరళ, గ్రామస్తులు సాంబశివనాయుడు, ఈశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా మామిడి సస్యరక్షణ

– జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి

చిత్తూరు రూరల్, మార్చి 4 ప్రభాతవార్త: మామిడి పంట సస్యరక్షణ చర్యలను రైతులు పక్కాగా చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు మ్యాంగో భవన్‌లో మంగళవారం మామిడి పంటల సస్యరక్షణ, ప్రత్యామ్నాయ పంటలపై అర్బీకె సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తలు హాజరై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడి కొమ్మల కత్తిరింపు చేపట్టి తెగుళ్ళు, పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చునన్నారు. పక్వానికి వచ్చిన కాయలను వెంటనే దఫాలుగా కోయడం వల్ల నాణ్యమైన కాయలు, అధిక దిగుబడి వస్తుందన్నారు. మామిడి పంటకు సంబంధించి కవర్లను 50 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో వున్నాయన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మామిడిలో తేనె మంచు పురుగుకు సంబంధించి బూప్రోఫేజిన్ లేదా బూప్రోఫేజిన్‌తో పాటు ఎసిఫేట్ మిశ్రమంతో నివారించవచ్చునన్నారు. మరో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కవిత మాట్లాడుతూ మామిడిలో బూడిద తెగులుకు హెక్సాకొనజోల్ వాడటం వల్ల నివారించవచ్చునన్నారు. శాస్త్రవేత్త మధుమతి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలైన పామియిల్, చింత, నిమ్మ, సీతాఫలం, కోకో, అవకాడో వంటి పంటలను మామిడిలో పెంచుకోవచ్చునన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎపిఎంఐపి పిడి బాలసుబ్రమణ్యం, జిల్లాలోని ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా మెనుతో విద్యార్థులకు భోజనం

– రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ ఆకస్మిక తనిఖీ

శ్రీరంగరాజపురం, మార్చి 4 ప్రభాతవార్త: పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన పక్కా మెనుతో దొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద భోజనం అందించాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ అకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనంను ఆయన రుచి చూసి విద్యార్థులకు మరింత రుచికర భోజనం అందించాలని అక్కడి అధికారులను ఆదేశించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మెను ప్రకారం భోజనం పెడ్తున్నారా! భోజనం ఎలా వుంది! అని ప్రశ్నించారు. అలాగే ఆయన కొత్తపల్లి దళితవాడలో అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేసి విద్యార్థుల హాజరుపట్టి, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి అంగన్‌వాడీ టీచర్ దివ్యకు కితాబు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శంకరన్, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, కార్వేటినగర్ సిడిపిఓ పద్మసునంద, లీగల్ మెట్రాలజీ సిఐ రమాదేవి, ఎస్ఆర్ పురం తహసిల్దారు లోకనాథపిళ్లై, హెడ్మాస్టర్ శాంతి, హైస్కూల్ ఛైర్మన్ ప్రహ్లాదన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సామిని, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి రూ.3.10 లక్షలు జరిమానా

చిత్తూరు రూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 31 మందికి రూ.3.10 లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి తీర్పు వెల్లడించారు. సోమవారం రాత్రి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 31 మంది ద్విచక్ర వాహనదారులను ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం జడ్జి ఉమాదేవి ఎదుట హాజరు పరిచారు. ఈ మేరకు జడ్జి ఉమాదేవి ఒకొక్క ద్విచక్ర వాహనదారుడికి 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు 31 మంది ద్విచక్ర వాహనదారులు 3.10 లక్షల రూపాయల జరిమానా చెల్లించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిఎపారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రేతలపై దాడులు

పుంగనూరు, మార్చి 4, ప్రభాతవార్త

మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో మంగళవారం పట్టణంలోని పలు దుకాణాలపై పారిశుద్ధ విభాగ సిబ్బంది దాడులు నిర్వహించారు. పట్టణంలో ఏడాది పైగా నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదని మెసేజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు గతంలో పలుసార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఈ నేపథ్యంలో పారిశుద్ధ విభాగ సిబ్బంది దుకాణాలపై దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారికి జరిమానాలు విధించారు. అదేవిధంగా పట్టణంలో మాంసం విక్రయించే దుకాణాలలో క్షుణ్ణంగా పరిశీలనలు జరిపారు. ప్లాస్టిక్ కవర్ల విక్రయదారులపై రూ.55 వేల రూపాయల జరిమానాలు విధించామని అధికారులు తెలియజేశారు.

లింగన్న చెరువు ఆక్రమణ అడ్డుకోండి

పాకాల, మార్చి 4, ప్రభాతవార్త

పాకాల మండలం దామలచెరువు ఊరు ముందు వున్న లింగన్న చెరువు గత ఇరవై సంవత్సరాల నుండి ఆక్రమణకు గురి అవుతూనే వున్నా పట్టించుకోని అధికారులు. చెరువుకు వస్తున్న సప్లై ఛానల్ పై అక్రమ కట్టడాలను తొలగించాలని పలుమార్లు మండల రెవిన్యూ అధికారులను కోరినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీతో కదిలిన యంత్రాంగం మంగళవారం రోజున పాకాల మండల సర్వేయర్ వాసుదేవ రెడ్డి, డి ఐ ఓ ఎస్ చంద్రబాబు, స్థానిక సచివాలయ సర్వేయర్ బాలాజీ ఆధ్వర్యంలో సప్లై ఛానల్ పై ఉన్న అక్రమ కట్టడాలను గుర్తించడం జరిగింది. తదుపరి రిపోర్టును పై అధికారులకు పంపించి అక్రమ కట్టడాలను తొలగించుటకు చర్యలు తీసుకుంటామని అధికారులు ఫిర్యాదుదారు పాటూరు మోహన్‌కి హామీ ఇచ్చారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

పూతలపట్టు మండలంలో స్టేట్ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ తనిఖీలు

పూతలపట్టు, మార్చి 4, ప్రభాతవార్త

మండలంలో మంగళవారం స్టేట్ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు. తమ సిబ్బందితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూతలపట్టు, ఎర్రచెరువుపల్లి రేషన్ షాపు, అలాగే అంగనవాడి స్కూలు, పూతలపట్టు స్కూలు, బియ్యం గోడౌన్ తనిఖీలు చేశారు. వీరి వెంట సోషల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు. హాస్పిటల్లో గర్భవతులకు, బాలింతలకు అదే పోషకాహారం వాటి పరిమాణం గురించి ఏఎన్ఎంలకు ఆశ కార్యకర్తలకు ఎం ఎల్ హెచ్ పి లకు తెలియ చేశారు. డాక్టర్ ప్రియాంక కమ్యూనిటీ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి అందరూ కలిసి చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అంగనవాడి స్కూల్లో పిల్లలతో మాట్లాడి భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గుర్రప్ప, మండల అధికారులు పాల్గొన్నారు.

గణనాధుని సేవలో మాజీమంత్రి ఆర్‌కె.రోజా

కాణిపాకం, మార్చి 4 ప్రభాతవార్త:

రాష్ట్ర మాజీ మంత్రి ఆర్‌కె.రోజా మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆమెకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. రోజా వెంట ఆలయ మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణ ఇంటర్వ్యూలు ప్రారంభం

చిత్తూరు రూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రుణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల ఏర్పాట్లను మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్‌లు పర్యవేక్షించారు. అభ్యర్థుల ఇంటర్వ్యూలకు కోసం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక హెల్ప్ డెస్క్, పది ప్రత్యేక కౌంటర్లు, బ్యాంకర్లతో ప్రత్యేక టేబుళ్ళను ఏర్పాటు చేశారు. చిత్తూరు నగర పరిధిలోని 38 బ్యాంకుల అధికారులు, ప్రతినిధులు ఈ ఇంటర్వ్యూలకు హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు, ఇంటర్వ్యూల నిర్వహణను పరిశీలించి సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచనలు చేశారు. మొదటి రోజు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 1-25 డివిజన్ల పరిధిలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న 824 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

హైటెక్ దోపిడి అడ్డుకట్టకు చర్యలు

– ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు రూరల్, మార్చి 4 ప్రభాతవార్త: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని, ఆన్‌లైన్ లావాదేవిలకు ప్రజలు దూరంగా వుంచాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో సైబర్ మోసాలు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో ఈ అంశం చర్చకు రావడంతో ఎంపీ దగ్గుమళ్ళ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ మహమ్మారికి ఆజ్యం పోసే మానసిక ఉచ్చులు, హైటెక్ దోపిడిలు, డిజిటల్ మోసాలను బట్టబయలు చేయాలని పోలీసు అధికారులను కోరారు. ఆన్‌లైన్ షాపింగ్ నుండి బ్యాంకింగ్ వరకు, మన జీవితాలు సాంకేతికతతో లోతుగా ముడిపడి వుందన్నారు.

ఆటో డ్రైవర్లకు నష్టం కలిగే జిఓలు రద్దు

– గాంధీ విగ్రహం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల నిరసన

చిత్తూరు రూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

ఆటో డ్రైవర్లకు నష్టం కలిగించే జిఓనెం.21, 31లను ప్రభుత్వం సత్వరం రద్దు చేయాలని, ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద ఏడాదికి 15 వేల రూపాయలు మంజూరు చేయాలని జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది యువత డిగ్రీ చదువులు చదువుకుని ఉద్యోగాలు లేక కుటుంబాలను పోషించుకోవడానికి ఆటోడ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జిఎస్ఆర్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రద్దు చేసి ఆటో మోటర్ వాహనాల ఫిట్‌నెస్, ఎఫ్‌సిలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 894 గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాహన మిత్ర కింద రూ.15 వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు భారీ జరిమానాలు పెంచి విధించే జిఓనెం.21, 31లను రద్దు చేసి ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయకుమార్, నాయకులు దూసరి చంద్ర, కె.మణి, కె.రమాదేవి, పి.రఘు, ప్రకాష్,నూర్‌భాషా, ఉమాపతి, యుగంధర్, నటరాజన్, జయరామన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల విజయంతో ప్రభుత్వంపై సంపూర్ణ మద్దతు

– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీ సురేంద్రకుమార్

చిత్తూరు రూరల్, మార్చి 4 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఒక ఉపాధ్యాయ, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరచిన అభ్యర్థులు విజయం సాధించడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు అయ్యిందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం వెంకిటీల సురేంద్రకుమార్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు హర్షిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నాయకులు గోపాల్, మేషక్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సన్నిధిలో ఆలయ పునర్నిర్మాణ దాత

కాణిపాకం,డిసెంబర్ 12 ప్రభాతవార్త: కాణిపాకం ఆలయ పునర్నిర్మాణం, బంగారు, వెండి వాకిలిల నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్ మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఏఈఓ రవీంద్రబాబు, దేవస్థానం మాజీ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓం నమఃశ్శివాయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి, మార్చి 4 ప్రభాతవార్త

పట్టణంలోని ఓం నమఃశ్శివాయ కమిటీ ఆధ్వ ర్యంలో స్థానిక తేరువీధిలోని స్వామివారి రథోత్సవం వద్ద భక్తులకు అన్నదానకార్యక్రమం నిర్వహించారు. పలువురు భక్తులు పులిరోహర అన్నదా నంతో పాటు విశేషమైన వంటకాలు వడ్డించారు. దీంతో పలువురు పరవశించి పోయారు. ఇదేనా అన్నదానం అంటూ పేర్కొన్నారు. ఇలాంటి అన్నదానం ఎక్కడా చూడలేదని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీను, మరియ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎండిఎం నిర్వాహకుల పొట్టకొట్టద్దు

శ్రీకాళహస్తి, మార్చి 4 ప్రభాతవార్త

ఏఎంపుత్తూరు నుంచి మద్యాహ్నభోజనం పథకానిన నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళ పొట్ట కొట్టదని సిఐటియు నాయకులు సూచించారు. బాధిత డ్వాక్రా మహిళలతో కలసి స్థానిక ఆర్టీవో కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ ఎఎంపుత్తూరు వేదికగా 20మంది డ్వాక్రా మహిళలు పట్టణ వ్యాప్తంగా 14 ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలకు మద్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 2015లో అప్పటి మంత్రిగా ఉన్న దివంగతనేత బొజ

తిరుపతి డివిజన్

అత్యాధునిక టెక్నాలజీతో మెరుగుపరుస్తున్న గ్రీన్‌ప్యానెల్

తిరుపతి విద్య, మార్చి 4 ప్రభాతవార్త

అధునాతన ఉత్పాదక సామర్థ్యాలను గ్రీన్‌ప్యానెల్ యొక్క సాటిలేని వృద్ధి పథం దేశీయ అంతర్జాతీయ మార్కెట్లలో దాని నిరంతర వృద్ధికి ఎండిఎఫ్ సంస్థ అతిపెద్ద వుడ్ ప్యానెల్ తయారీదారు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి వద్ద అత్యాధునిక తయారీ కేంద్రంలో కొత్త ఉత్పత్తి శ్రేణిని ప్రారంభించింది. ఈ సందర్భంగా గ్రీన్ ప్యానెల్ విభాగ హెడ్ శోభన్ మిట్టల్ మాట్లాడుతూ ఈ వ్యూహాత్మక విస్తరణ పరిశ్రమలో గ్రీన్‌ప్యానెల్ నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ, తద్వారా కంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. ఈ తాజా అడిషన్ వివిధ అనువర్తనాల్లో ఖచ్చితమైనఇంజనీరింగ్ ఎండిఎఫ్ పరిష్కారాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీరుస్తుందన్నారు. ఈ కొత్త ఎండిఎఫ్ లైన్ అభివృద్ధి చెందుతున్న మార్కెట్ డిమాండ్లను తీర్చడానికి మరియు అపరిమిత అవకాశాలను అందిస్తుందని చెప్పారు.

ఇంటర్ పరీక్షల్లో 827 మంది గైర్హాజరు: ఆర్.ఐ.ఓ

తిరుపతి విద్య, మార్చి 4 ప్రభాతవార్త

జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని, పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 32,467 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్.ఐ.ఓ జీ.వి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 86 జనరల్, 15 వొకేషనల్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంగ్లీష్ పేపర్1 పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జనరల్ 31,900 మంది, ఒకేషనల్లో 1,394 మంది మొత్తం 33,294 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా జనరల్లో 732, ఒకేషనల్లో 95 మంది, మొత్తం 827 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో త్రాగు నీటి వసతి, పోలీసు బందోబస్తు, మెడికల్ క్యాంపు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పర్యవేక్షణ, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా బస్సుల సౌకర్యం కల్పించామని ఆర్.ఐ.ఓ ఆ ప్రకటనలో తెలిపారు.

ఆడ పిల్లలందరూ చదువుకోవాలి

– యుక్త వయసులో సమతుల్య ఆహారం తీసుకోవాలి

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 4 ప్రభాతవార్త:

ఆడ పిల్లలందరిని తల్లిదండ్రులు కచ్చితంగా చదివించాలని, యుక్త వయసు సమయంలో సమతుల్య ఆహారం అందించాలని వైద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ మాసాంతపు సమీక్ష వైద్యాధికారి అధ్యక్షతన ఆరోగ్య అధికారి డి.ఎన్.వెంకటేశ్వరులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే శారీరకంగా మానసికంగా అభివృద్ధి చెందుతారని, రక్తహీనతను అధికమించి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింప చేసుకుని మాతృమరణాలు శిశు మరణాలు లేకుండా చూడవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రతి గ్రామంలోను ఆడ పిల్లలందరినీ యుక్త వయసు బాలికలందరిని వారి తల్లిదండ్రులను సమావేశపరచి ఈ విషయాలపై కోలంకుశంగా తెలియజేయవలసిందిగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 4 ప్రభాతవార్త:

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతో పాటు మెను ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం నేర్వాకోట ప్రాథమిక పాఠవాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, బడిఈడు పిల్లలు బడిలోనే చదువుకునేలా కృషి చేయాలని సూచించారు.

డి.దుర్గాప్రసాద్ రావ్‌కి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి విద్య, మార్చి 4 ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నార్త్ రాజు పాలెం ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ విభాగంలో వెర్బల్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ గా విధులు నిర్వహిస్తున్న డి.దుర్గాప్రసాద్ రావ్ కి డాక్టరేట్ లభించింది. "జేమ్స్ బోర్డ్ విన్ నవెల్స్ ఎ స్టడి ఇన్ థి మాటిక్ కన్సర్న్స్ "అంశంపై ప్రొఫెసర్ వి.రవి నాయుడు మార్గదర్శకత్వంలో ఈయన డాక్టరేట్ పొందినట్లు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం.దామ్లా నాయక్ తెలిపారు.

లక్ష్మిరెడ్డి కథ సుఖాంతం

తిరుపతి హెల్త్, మార్చి 4 ప్రభాతవార్త ః

గత నెల రోజులుగా జనసేన నేత కిరణ్‌రాయల్ తన దగ్గర రూ. 1 కోటి 20 లక్షలు, 20 సవరాల బంగారం తీసుకున్నారని, అడిగితే తనను, తన బిడ్డలను చంపివేస్తాడని, కిరణ్‌రాయల్, జనసేన పార్టీ సైనికులు, వీరమహిళల నుంచి తనకు ప్రాణ రక్షణ కావాలని మీడియాలో ఎక్కారు. అయితే తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో బాధితురాలు లక్ష్మిరెడ్డి మాట్లాడారు. తనకు కిరణ్‌రాయల్‌కు మధ్య జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు ఒక కొలిక్కి వచ్చాయని, దీని వెనుక జనసేన పార్టీ ఓ నేత ఈ తతంగం అంతా నడిపించి తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారని, ఇక మీదట అలా జరగకూడదని చెప్పారు. కిరణ్‌రాయల్‌కు, తనకు మధ్య జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు నేటితో ముగిశాయని, పోలీసులు, ప్రింట్ అండ్ మీడియా మిత్రుల సహకారంతో తన కథ సుఖాంతం అయిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసే అవకాశం ఉందని చెప్పడం కొసమెరుపు.

జాతీయ స్థాయి క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులను అభినందించిన శాప్ చైర్మన్

తిరుపతి క్రీడ, మార్చి 4, ప్రభాతవార్త

ఉత్తరాఖండ్ వేదికగా జనవరి 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ జరిగిన 38వ జాతీయ క్రీడల్లో భాగంగా కెనో స్లాలమ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన నగిడి గాయత్రి, 3వ స్థానంలో నిలిచిన చేతన భగవతి, 4వ స్థానంలో నిలిచిన నగిడి రాజేష్‌లను మంగళవారం మంగళగిరి నియోజకవర్గం కొలనుకొండలోని శాప్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో శాప్ చైర్మన్ రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి గాయత్రి మాట్లాడుతూ జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించడం జరిగిందని, ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు థాయిలాండ్‌లో జరగనున్న ఏషియన్ ఛాంపియన్షిప్ కెనో స్లాలమ్ పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శాప్ చైర్మన్ అభినందిస్తూ సత్కరించడం జరిగింది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర కీర్తి ప్రతిష్టతలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపజేయాల్సిన బాధ్యత క్రీడాకారులపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చెర్లోపల్లి సర్పంచ్ సుభాషిణికి ఉత్తమ సర్పంచ్ అవార్డు

తిరుపతిరూరల్, మార్చి04 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ చెర్లోపల్లి గ్రామ సర్పంచ్ బి.సుభాషిణికి జాతీయస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రాజన్ సింగ్ చేతుల మీదగా ఉత్తమ సర్పంచ్ అవార్డును సుభాషిణి అందుకున్నారు. తిరుపతి జిల్లా, తిరుపతిరూరల్ మండలం చెర్లోపల్లి గ్రామ పంచాయతీ గ్రామ సర్పంచ్ జాతీయస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్న శుభ సందర్భంగాలో ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్యంతో పాటు పచ్చదనం పెంపు, ప్రజల జీవన స్థితిగతులలో మార్పు తెవడం, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, సకాలంలో పన్నులు వసూలు చేసి, పంచాయతీ అభివృద్ధికి సహకరించడం తదితర బృహత్తర కార్యక్రమాలు చేసినందునే ఆమెకు జాతీయ స్థాయి ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నట్లు పలువురు వక్కానించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన

తిరుపతి కార్పొరేషన్, మార్చి 4, ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం హైవే రోడ్డులో తన పల్లి క్రాస్ నుంచి ఆర్.సి పురం జంక్షన్ వరకు వాహన తనిఖీలు నిర్వహించారు. రికార్డ్స్ లేనటువంటి 19 ద్విచక్ర వాహనాలు, 1 ట్రాక్టర్, 1 కారు, 1 ఆటో, మొత్తం 22 వాహనాలను సీజ్ చేసామన్నారు. వాహన తనిఖీల్లో భాగంగా వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, ద్విచక్ర వాహనం నడుపునప్పుడు మొబైల్ ఫోన్‌ను ఉపయోగించరాదన్నారు. ట్రిపుల్ రైడింగ్ నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనం నడుపు రాదని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనం ఇస్తే తండ్రి మీద కేసు అవుతుందన్నారు. ట్రాఫిక్ పాయింట్ నందు ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి వాహనం నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా సంబంధిత రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. వాహనదారులకు కొత్త మోటర్ వెహికల్ చట్టం 1998 (అమెండ్మెంట్ ఇన్ 2019) వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ చారి ట్రాఫిక్ డిఎస్పి, సంజీవ్ కుమార్ సిఐ, ట్రాఫిక్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ధర్నా - సీపీఎం

పుత్తూరురూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణం, మండలంలోని అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలైనా పేద ప్రజలు సమస్యలు పట్టించుకోవడం లేదని, అదే విధంగా ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, గంగాధరం, లీలావతి, సంపూర్ణమ్మ, మోహన్‌కఉమారి, దేశమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో వివేకానంద విద్యార్థిని ప్రతిభ

పుత్తూరురూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని ఎస్.అక్షయ హనిప్రియ తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో జరిగిన జాతీయ షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్‌లో 3వ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డి.సదాశివం మాట్లాడుతూ సాధనతోనే మనం దేనినైనా సాధించగలుగుతామని తెలియజేస్తూ విద్యార్థిని తల్లిదండ్రులను అభినందించారు.

ఇంద్ర విమానంలో ఊరేగుతున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు

పుత్తూరురూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 53వ సంవత్సరం బ్రహ్మోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారు, అమ్మవారు ఇంద్ర విమానంలో ఊరేగుతూ భక్తులకు ఇంద్ర విమానంలో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు పంచామృతాభిషేకాలు చేశారు. రాత్రి మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఉభయ దాతలుగా ఎంఆర్ఎఫ్ డీలర్ పి.ఆర్.సుబ్రహ్మణ్యం, వీణ కోసరాజు, ఇన్‌చార్జి ఎంఎస్ పయనీర్ స్పిన్నింగ్, వివింగ్ లిమిటెడ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వంశపారంపర్య ధర్మకర్త ఎం.సుందరం, ఆలయ అర్చకులు ఎస్.రవిచంద్రన్ గురుకుల్, ఆర్.శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పుత్తూరురూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరుపుకుంటున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మై హెల్తీ ప్లేట్, చిరు ధాన్యాల ప్రాముఖ్యతపైన అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్టు కో-ఆర్డినేటర్ సంతోషి, అంగన్‌వాడీ కార్యకర్తలకు బ్యాలెన్స్ డైట్ గురించి వివరించారు. సంధ్య సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు లబ్ధిదారులకు బ్యాలెన్స్ డైట్, చిరు ధాన్యాలు వినియోగంపైన అవగాహన కల్పించి వాటిని వాడేలా చూసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ వేలాయుధంని పరామర్శించిన మాజీ మంత్రి రోజా

పుత్తూరురూరల్, మార్చి 4 ప్రభాతవార్త:

పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణాపురం సర్పంచ్ వేలాయుధం అమ్మ ఇటీవల కాలంలో మృతి చెందింది. మంగళవారం గ్రామంలోని ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి కుమారుడు సర్పంచ్ వేలాయుధం, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు మున్సిపాలిటీ 2వ వార్డు ఒంటిమిట్టలో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బసవరాజు భాస్కర్‌రాజు ఇటీవల కాలంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి రోజా ఒంటిమిట్ట గ్రామానికి వెళ్లి బసవరాజు స్వగృహంలో చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు పుత్తూరు మున్సిపాలిటీ మండల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంలో సుబ్రమణ్యం స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధ్యాత్మిక చింతన వెల్లి విరుస్తుంది. ధార్మిక దివ్యక్షేత్రంలో ప్రతి రోజూ ధార్మిక కార్యక్రమాలతో తులతూగుతుంది. స్థానిక భక్తులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా ఆధ్యాత్మిక చింతతనలో తన్మయత్వం పొందుతున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియటంతో వారం వారీ పూజలకు అవకాశం లభించింది.

నాలుగు చెరుగులా ఆధ్మాత్మికత: మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి, ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు.

పరశురామేశ్వరుని సేవలో యూనియన్ బ్యాంకు సిఇఓ

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తినియోజకర్గం ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయాన్ని మంగళవారం యూనియన్ బ్యాంక్ సిఇఓ ఏ మునిమేకల కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ మాజీ చైర్మెన్ బత్తలగిరి బాబు నాయుడు, ఆలయ ఇఓ కే.రామచంద్రారెడ్డి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆయన స్వామి అమ్మవార్లను దర్శించుకున్న తరువాత వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఇఓ రామచంద్రారెడ్డి ఆలయ విశిష్టతను వివరిస్తూ పురావస్తుశాఖ పర్యవేక్షణలో ఉన్న ఈ ఆలయ సందర్శనానికి స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి చొరవతో ఇటీవల చక్కటి రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయాధికారులతో పాటు పేట యూనియన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ ఆంజనేయులు శ్రీకాళహస్తి బ్రాంచి మేనేజర్ జిఎం పాల్గొన్నారు.

దశరధాచ్చారిని పరామర్శించిన రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిదశరధాచ్చారి ఆనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతుండగా శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని పార్టీకి పూర్తి స్థాయిలో సేవలందించాలని కోరారు. ఆమెతో పాటు మాజీమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షురాలు సుమతి తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ ఆందోళన

శ్రీకాళహస్తి, మార్చి 4 ప్రభాతవార్త

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగువం బాబు సారధ్యంలో గ్రామాల్లో శ్రీకాళహస్తి నియో జకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. రైతులు పండించిన పంట ఇళ్ళలో దాచిపెట్టుకునే గాదెల వ్యవస్థ లేనందువల్ల రోడ్లమీదనే వరి ఎండబెట్టుకోవటం గమనించారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామం సమీపంలో రైతులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పండించిన పంట ధర, అలాగే మార్కెట్లో బియ్యం ధరను విచారించారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది వరి ధర దారుణంగా పడిపోయిందన్నారు. కోతల తరువాత మిల్లర్ల వద్దకు కాళ్ళు అరిగేలా తిరగాల్సి వస్తుందని రైతులు కాంగ్రెస్ నాయకులకు వివరించారు. గత ఏడాది రూ.2500లు ఉన్నధర నేడు కనీసం రూ.1600లు కూడా పలకటం లేదని వాపోయారు. నేడు పండించుటకు పెట్టిన పెట్టుబడి కూడా రైతులకు దక్కలేదని దాంతో అప్పుల పాలౌన్నామని రైతులు కాంగ్రెస్ నాయకులకు వివరించారు. ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో రైతులకు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్న హామీని వెంటనే అమలు చేసి రైతుల్ని ఆదుకోవాలని కోరారు. అలాగే గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించాలని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన పంటలను తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు తలపా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మద్దతు ధరను ప్రకటించిన ప్రభుత్వం రైతులు పండించిన పంటను తీసుకోవటంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ చేతకాని తనంతో వరి పండించిన రైతులు రైసుమిల్లర్లపై ఆధారపడాల్సి వచ్చిందని, దాంతో వారి ఇష్టారాజ్యంగా మారిందని ధ్వజమెత్తారు. ఈ క్షేత స్థాయి పరిశీనలల్లో జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు స్థానిక అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి జిల్లా కోశాధికారి వేలు, నాయకులు కరీముల్లా, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ చట్టరీత్యా నేరం

కేవీబీ పురం, మార్చి 4 ప్రభాతవార్త:

నాటుసారా తయారీ, విక్రయం చేయడం చట్టరీత్యా నేరమని శ్రీకాళహస్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య అన్నారు. కేవీబీ పురం మండలంలోని రంగయ్యగుంట గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల్లో అక్రమ నాటుసారాయి తయారీ విధానాన్ని అరికట్టి, నాటుసారా సేవించడం వలన వచ్చే దుష్ప్రభావాల గురించి ప్రజలకు తెలియజేశారు. అలాగే గ్రామాల్లో అక్రమంగా నాటుసారా తయారు చేస్తే వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అధికారులు భాస్కర్, నిరంజన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

కేవీబీ పురం, మార్చి 4 ప్రభాతవార్త:

మండలంలోని ఏపీ మోడల్ స్కూల్(ఆదర్శ పాఠశాల)లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పిన్నమరెడ్డి మోహన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో విద్యార్థులు చేరుట కొరకు డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. సీఎస్ఈ. ఏపీ.జీవోవీ ఇన్/ఏపీఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మార్చి 31 తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు పరీక్ష రుసుము చెల్లించాలని ఆయన అన్నారు.

60 మద్యం బాటిళ్లు స్వాధీనం

విజయపురం, మార్చి 4 ప్రభాతవార్త:

మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ సమీపంలో ఎల్లసముద్రం వద్ద అక్రమంగా తరలిస్తున్న 60 క్వాటర్ బాటిళ్ళను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిల్ తరలిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకుని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ హాజీజ్, సీఐ భాస్కర్ సమక్షంలో హాజరు పరచారు. అరెస్టు చేసిన శివయ్యను కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

మోటారు, చేతిపంపు బోర్లను పరిశీలిస్తున్న అధికారులు

విజయపురం, మార్చి 4 ప్రభాతవార్త:

మండలంలోని ఇళ్ళత్తూరులో మంగళవారం ఎంపీడీవో రాజేంద్ర, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ హరిప్రసాద్ మోటార్లను చేతిపంపు బోర్లను పరిశీలించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు మునిభాస్కర్‌రాజు, నాయకులు ఏళుమలై, తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న పార్కింగ్ వాహనాలు తొలగించండి

కమిషనర్ ఎన్ మౌర్య

తిరుపతి కార్పొరేషన్, మార్చి 4, ప్రభాతవార్త

నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్ట్ ల వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం ఉదయం 41, 35 వార్డుల్లో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కొత్తగా వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లలో వాహనా

గూడూరు డివిజన్

సభను విజయవంతం చేయాలి

గూడూరు, మార్చి 4 ప్రభాతవార్త : ఈనెల 14వ తేదీన చిత్రాడ, పిఠాపురంలో జరగబోయే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్త, జనసేన పార్టీ తిరుపతి ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసుల సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు తిరుపతి పార్లమెంట్ పరిధిలో ఉన్న గూడూరు నియోజకవర్గ నాయకులు జనసేన పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖరరావు, గూడూరు నియోజకవర్గం పిఓసి కె.మోహన్, జనసేన నాయకులతో జనసేన పార్టీ ఆవిర్భావ సభ కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శేఖర్, వెంకటరమణ, కార్తీక్, సునీల్ కుమార్, గురుబాబు, ఉప్పు సాయికిరణ్ పాల్గొన్నారు.

స్విమ్స్‌చే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చిల్లకూరు, మార్చి 4 ప్రభాతవార్త: తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో మంగళ వారం గూడూరు డివిజన్ లోని చింత వరం పిహెచ్‌సి పరిధిలో గల తొను కుమాల, చేడిమాల గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిం చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కాగా, చింతవరం పిహెచ్ సి పరిధిలో మార్చి 4న చేడిమాల, తొనుకుమాల, మార్చి 6న తిక్కవరం, ఏరూరులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ బి.పాల్ జాన్సన్, డాక్టర్ సుమ, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, సర్పంచులు త్రివిక్రమ్ భూపతిరావు, కొల్లూరు పద్మ, పంచాయతీ కార్యదర్శులు నాగూరయ్య, సిరాజ్, స్థానిక నాయకులు భాస్కర్, కుమార్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లురెడ్డి, పిహెచ్ ఎన్ కోటేశ్వరమ్మ, సూపర్వైజర్ సురేష్, ఎంఎల్ హెచ్ పిలు జి.కావ్య, జె.క్రాంతిరేఖ, ఏఎన్ఎంలు ఎం.కాంతమ్మ, అంకమ్మ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు!

నాయుడుపేట, మార్చి 4 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని చిలమత్తూరు,కూచివాడ, కాపులూరు, పూడేరు, గొట్టిప్రోలు, ద్వారకాపురం తదితర గ్రామాల్లో బెల్టుషాపులు రోజురోజుకు పుట్టు కొస్తున్న సంబంధిత ఎక్సైజ్ అధికారులు,పోలీసులు పట్టించుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపి స్తున్నారు. ఇప్పటికైనా జిల్లాఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులు నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ మహిళలు కోరుతున్నారు.

ఆటోలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి

గూడూరు, మార్చి 4 ప్రభాతవార్త: రవాణా రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలని, జీవో నెంబర్ 21,31 రద్దు చేయాలి వాహన మిత్ర 15 వేల రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జి.ఆర్.ఎస్ 124(ఈ) నోటిఫికేషన్ 8,9,4 నోటిఫికేషన్ డ్రైవర్లకు ఉపాధి లేకుండా చేసే 2023 నూతన మోటారు యాక్ట్ చట్టం 106(1)(2) ను రద్దు చేయాలని టాటా మ్యాజిక్ వ్యానులు కార్లు జీపులపై భారీగా పెంచిన రోడ్ టాక్స్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ గ్రీన్ టాక్స్ లేబర్ టాక్స్ టోల్గేట్ ఫీజులను 30 శాతానికి తగ్గించి డ్రైవర్ల పిల్లలకు విద్యా కానుక వెంటనే ఇవ్వాలి. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్,సీపీఐ మండల కార్యదర్శి రమేష్, ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎంబెటి చంద్రయ్య, నారాయణ, కె.రాజా, ముని, శ్రీను, కృష్ణ అంకాయ, ఆటో కార్మికులు అరవింద్, దశయ్య, సాయి, కార్తీక్, గిరి, కృష్ణాయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా... చేయడమే సీఎం లక్ష్యం : ఎపిఎం

కోట, మార్చి 4 ప్రభాతవార్త: పొదుపు మహిళలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయమని కోట వెలుగు ఎపిఎం అనిల అన్నారు. మంగళవారం వెలుగు కార్యాల యంలో విలేఖరులతో మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఈ-వ్యాపారం దిశగా ప్రభుత్వం సన్నద్ధం చేస్తుందన్నారు. ఇంటి నుంచే ఉత్పత్తులను విక్రయించి ఆర్థిక స్వావలంబన దిశగా పొదుపు ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం సీఎంఎస్ఎం ఇలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెల 8న అంతర్జా తీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని లక్షమంది మహిళలు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్ చేసే విధంగా ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ తోడ్పాటుతో వినియోగదారులకు అవసరమైన వస్తువులు, ఉత్పత్తులు ఆన్‌లైన్ వేదికగా తీసుకొచ్చి విక్రయాలు చేయాలన్నదే ప్రభుత్వ ఆశయం అన్నారు. కలంకార, డెయిరీ, తేనె, మిలెట్స్, కూర గాయలు, చెక్కబొమ్మలు, ఎంబ్రాయిడరీ దుస్తులు, జనపనార బ్యాగులు తదితర వాటిని ఈ-కామర్స్ వేదికపై తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజనేని రామానాయుడు ట్రస్ట్‌చే ఆర్థిక సహాయం

చిల్లకూరు, మార్చి 4 ప్రభాతవార్త: చిల్లకూరు మండ లం ఓడూరు గ్రామంలోని గిరిజన కాలనీకి చెందిన సిద్ధపరెడ్డి రేణుక పైచదువుల నిమిత్తం పదివేల రూపాయలను రాజనేని రామానాయుడు చారిట బుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీని వాసులు నాయుడు దాతృత్వంతో ట్రస్ట్ సభ్యులైన బాబు, ప్రజేంద్రారెడ్డి ద్వారా మంగళవారం ఓడూరు గ్రామంలోని పాఠశాలలో అందించారు. రేణుక తల్లిదండ్రులు ఇద్దరూ డయాలసిస్ పేషెంట్లు అవడంతో వారి ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల లీలావతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో తడ ఐటిఐకి మంచిరోజులు

తడ, మార్చి 4 ప్రభాతవార్త: పారిశ్రామికవాడ తడలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో అధ్వాన్న పరిస్థితిలో ఉన్న మూడు తరగతి గదులను ఆధునీకరించారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో అక్కడి ఇండియా మెటల్-1 స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐ మార్ట్) పరిశ్రమ ఈ తరగతి గదుల మరమ్మతులు చేపట్టడం కాకుండా ఆధునీకరించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా రూ.7.5 లక్షలు ఇందుకోసం కేటాయించింది. మరమ్మతు లతో పాటు తరగతి గదుల్లో డెస్కులు, బల్లలు ఏర్పాటు చేశారు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, ఐ మార్ట్ ఉన్నతాధికారుల సమక్షంలో ఆ కంపెనీ ఎండి టాయిజో ఇవాని తరగతి గదులను ఐటిఐ ప్రిన్సిపాల్ దేవదానంకు అందజేశారు. ఈ సందర్భంగా ఇవాని మాట్లాడుతూ స్థానిక విద్యాసంస్థల మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు తమ కంపెనీ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఐ మార్ట్ వారిని అభినందించిన నిరీషా సన్నారెడ్డి శ్రీసిటీ ప్రత్యేక చొరవతో పరిశ్రమల చురుకైన భాగస్వామ్యం తోడై ఈ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక సదుపాయాలు చాలావరకు మెరుగుపడ్డాయన్నారు. శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీకి అంబులెన్స్ వితరణ తిరుపతిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్టీల్ టెస్టింగ్ కోసం యూనివర్శల్ టెస్టింగ్ మిషన్, జిల్లా అగ్నిమాపక శాఖలో వనరుల పెంపునకు నిధుల సాయం, మూడు డిజిటల్ క్లాస్ రూముల ఏర్పాటు వంటి కార్యక్రమాలు ఐ మార్ట్ చేపట్టింది.

వేధింపులపై కేసు నమోదు

కోట, మార్చి 4 ప్రభాతవార్త: కోట మండలం కేశవరం గ్రామానికి చెందిన ప్రవళిక, చిల్లకూరు మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన పరశురామ్ 2020లో వివాహం చేసుకున్నారు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగింది. భర్త పరశురామ్ తరచూ మద్యం సేవించి తనను హింసించే వాడని బాధితురాలు ప్రవళిక కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంటి నుంచి గెంటేయడంతో తాను పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవ వైవిధ్యంపై అవగాహన

గూడూరు, మార్చి 4 ప్రభాతవార్త: గూడూరు ఎస్.కె.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో 4వ తేదీన డిపార్ట్మెంట్ ఆఫ్ జువాలజీ ఆధ్వర్యంలో జీవవైవిధ్యం పైన అతిథి ఉపన్యాసము ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా డీ.కె. డబ్ల్యూ కాలేజీ, నెల్లూరు జువాలజీ అధ్యాపకురాలు డాక్టర్ సి.హెచ్ లలిత కుమారి జీవవైవిధ్యం పరిరక్షణ పైన విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మానవ వికృత చర్యల వల్ల వన్యప్రాణులకు హాని కలుగుతుందని వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన జీవవైవిధ్యం ప్రకృతి సమ తౌల్యానికి దోహదపడుతుందని, వన్యప్రాణుల పరిరక్షణ, కనుమరుగై పోతున్నటువంటి వివిధ జీవజాతులను నిలబెట్టు కోవాల్సి నటువంటి బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరి మీద ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పీరకుమార్, అధ్యాపకులు శ్రీధర్ శర్మ, కిరణ్మయి, ఎన్సిసి ప్రోగ్రాం ఆఫీసర్ మైమూన్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.నారాయణరాజు, హిమబిందు, రవిరాజు, శైలజ, సుందరమ్మ ఇతర అధ్యాపక ఆధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగృహాల కోసం నక్కలోళ్ల నిరీక్షణ

కోట, మార్చి 4 ప్రభాతవార్త: ప్రతి పేదవాడికి తినడానికి తిండి, కట్టుకోడానికి బట్ట, ఉండటానికి ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆ మేరకు నీడ వసతి లేని వారు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఇటీవల ప్రభుత్వం కోరింది. అయితే కేశవరం పంచాయతీలోని నక్కలోళ్లు గత పదేళ్లుగా అక్కడ నివాసం ఉంటున్నారు. వారికి పక్కాగృహాలు నిర్మించేందుకు అవకాశం లేదని, వారు ఉంటున్న స్థలం పోరంబోకు స్థలమని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తమకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పక్కాగృహాల వసతి కల్పించాలని వారు అధికారులను కోరుతున్నారు. గతంలో నక్కలోళ్లు బతుకు జీవనం కోసం పగలంతా అక్కడక్కడా సంచరిస్తూ రాత్రిపూట కోట ఆర్టీసీ బస్టాండులో ఉండేవారు. వారిని సమాజంలో ఒకరిగా గుర్తించి వారికి బాసటగా రక్ష అనే సంస్థ నిలిచింది. వారి సమస్యలపై అధికారులతో ఆ సంస్థ ఛైర్మన్ దాసరి సురేష్ చైతన్య పలుమార్లు పోరాటం చేసి అధికారుల సహకారంతో కేశవరంలో కాలనీ ఏర్పాటు చేశారు. వారి పిల్లలు చదువుకునేందుకు శ్యామసుందరపురంలో ప్రత్యామ్నాయ పాఠశాలను సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ సురేష్ గూడూరుకే పరిమితమయ్యారని, తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని నక్కలోళ్లు ఆందోళన వ్యక్తం చేశారు.

సోషల్ ఆడిట్‌పై సమగ్ర నివేదిక ఇవ్వండి : ఎంపీడీవో

వాకాడు, మార్చి 4 ప్రభాతవార్త : 2023-2024 సంవత్సరంలో జరిగిన ఎంజి ఎన్ఆర్జిఎస్ ద్వారా వివిధ శాఖలో జరిగిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని స్త్రీ శక్తి భవనంలో మండల స్థాయి సర్పంచులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సోషల్ ఆడిట్ పై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ 2023 సంవత్సరం నుండి 24 ఏప్రిల్ వరకు జరిగిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ జరుగుతుందని అన్నారు, పబ్లిక్ ఈరింగ్ లోపల ఆ సమయంలో వచ్చినటువంటి అధికారులకు ఫీల్డ్ అసిస్టెంట్ లో, వివిధ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.ఈ సమావేశంలో ఏపీవో విజయ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచులు బండి వెంకట రత్నమ్మ, రమణమ్మ పంచాయతీ కార్యదర్శులు, ఎనర్జీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అపహరణకు గురైన బాలిక...క్షేమంగా తల్లిఒడికి

-నిందితురాలు మహిళ ప్రైవేట్ ఉద్యోగిని

తిరుమల,మార్చి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో ఆస్థాన మండపం వద్ద పనిచేసే కార్మికురాలు కె.కరుణశ్రీ, కె.నరసింహులు కుమార్తె దీక్షిత(4) సోమవారం సాయంత్రం అపహరణకు గురైంది. తల్లిదండ్రులు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో పాప కనిపించక పోవడంతో తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తమయ్యే లోపు ఆ మహిళ బాలికను తీసుకుని ఆర్టీసి బస్టాండు మీదుగా బస్సులో తిరుపతికి వెళ్ళినట్లు గుర్తించారు. సిసికెమెరా పుటేజీ సాయంతో బాలికను తీసుకెళ్ళిన మహిళ ఫోటోను కూడా పోలీసులు సామాజిక మాధ్యమాల్లో, టిటిడి వాట్సాప్‌గ్రూపుల్లో, పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో, మీడియా గ్రూపుల్లో ప్రసారం చేశారు. అప్పటికే సమాచారం అందుకున్న తిరుమల అడిషనల్ ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడు, విజిలెన్స్ సిబ్బంది తిరుపతి పోలీసులను అప్రమత్తం చేశారు. బాలిక ఆ చూకీ కోసం పోలీసు బృందాలు నాలుగు విడిపోయి సిసికెమెరాల పుటేజీ ఆధారంగా గుర్తించారు.

-పట్టించిన కార్మికురాలు యూనిఫామ్

తిరుమలలో పారిశుధ్యవిభాగంలో శానిటరీ వర్కర్స్ సూపర్‌వైజర్ వెంకట రమణమ్మ (50) విధులు ముగించుకుని బాలికను ఎత్తుకెళ్ళింది. సిసికెమెరా ఆధారంగా గుర్తించడంతో బాటు తోటి కార్మికుల సహాయంతో ఆమె సెల్‌ఫోన్ నంబర్‌ను కనుగొన్నారు. ఆమె ఫోన్‌కాల్స్ ట్రాక్‌లో ఆమె తిరుపతి బస్టాండుకు సమీపంలోని చిన్నకాపువీధిలో నివాసముంటున్నట్లు రాత్రి 11గంటలకు కనుగొన్నారు. ఆమె వివరాలతో తిరుపతి పోలీసులు ఆమె ఇంటిని చుట్టుముట్టారు. అప్పటికే బాలికతో సహా ఉన్న వెంకటరమణమ్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలికను సురక్షితంగా రాత్రి 12గంటలకు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొన్నిగంటల వ్యవధిలోనే పట్టుకోవడంతో నెలకొన్న ఉత్కంఠ తెరపడింది. బాలికను తల్లిదండ్రులకు సురక్షితంగా చేర్చారు. మంగళవారం ఉదయం తిరుమల 1టౌన్ పోలీసు స్టేషన్‌లో తిరుపతి ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, సిఐలు విజయకుమార్, రాముడు సిబ్బంది పనితీరును ఎస్పీ అభినందించారు. తిరుమలలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం సిసికెమెరాల నిఘా ఉండాలని ఆదేశించారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య!

నాయుడుపేట, మార్చి 4 ప్రభాతవార్త : కుటుంబ కలహాలు కారణంగా మునిలక్ష్మి (28) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది.పోలీసుల సమాచారం మేరకు.. దొరవారిసత్రం మండలం వేణుంబాక గ్రామానికి చెందిన మునిలక్ష్మిని పెళ్ళకూరు మండలం పునబాకకండ్రిగలో ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. అప్పటి నుండి సజావుగా సాగిన వారి కాపురం గతకొంత కాలంనుండి భర్త మద్యానికి అలవాటుపడి తరచు ఆమెతో ఘర్షణ పడేవాడు. ఈక్రమంలో భర్త మద్యం తాగి ఘర్షణకు దిగడంతో మనస్థాపం చెందిన మునిలక్ష్మి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకొంది. విషయం గుర్తించిన ఆమె తల్లిదండ్రులు 108 సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ఆమె చికిత్సపొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది.ఆమె మృతి చెందడంతో ఆకుటుంబం వీదినపడినట్లైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : పిడి

బాలాయపల్లి, మార్చి 4 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. బాలాయపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం పనుల ప్రజా వేదికను నిర్వహించారు. 2023 ఆర్థిక సంవత్సరంలో 24పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పథకంపై ప్రజా వేదికను వెల్లడించారు. 16కోట్ల రూపాయల పనుల్లో రు.15 కోట్ల రూపాయల పనులు జరిగాయి. పెరిమిడి, భైరవరం, కాకపొడి, గొట్టికాడు పంచాయతీల్లో కోటి 50లక్షల రూపాయల పనులు జరిగాయి. పనులు సక్రమంగా చేయ నందున మస్తానయ్య, టిఏ వెంకటయ్యను సస్పెండ్ చేస్తున్నట్లు పిడి శ్రీనివాసప్రసాద్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి వరప్రసాద్, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో డీజే వినీల్ కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, ఎస్సిపి పి.రవి, ఏపీవోలు ఆశరాణి, మృత్యుంజయరావు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌చే పలు సేవా కార్యక్రమాలు

గూడూరు, మార్చి 4 ప్రభాతవార్త: గూడూరు రోటరీ క్లబ్‌నకు రోటరీ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్ రోటేరియన్ సి.ఎ.సాధుగోపాలకృష్ణ మంగళవారం అధికారిక పర్యటనకు విచ్చేసారు. వారి చేతులు మీదుగా గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రికి రోటరీ క్లబ్ అధ్యక్షులు రోటేరియన్ శ్రీధర్ రెడ్డి దాతృత్వంతో ఆప్పుడే పుట్టిన పిల్లలకు క్యాప్ టవల్స్, జి.యస్.ఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలకు సైబరాబాద్ రోటరీ క్లబ్ అధ్యక్షులు రోటేరియన్ చదలవాడ మురళీధర్ దాతృత్వంతో 3కంప్యూటర్లు బహుకరించడమైనది. తదుపరి అల్లూరి ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలో డిస్ట్రిక్ట్ గ్రాంట్‌తో రూపొందిన ఫిజియోథెరపీ సెంటర్ వీధి పేర్లు సైన్ బొర్డు పథకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పిడీజీలు బొమ్మిరెడ్డి సురేంద్రారెడ్డి, మునిగిరేష్, ఏ.డి.జి వాసు గౌడ్, సీనియర్ రొటేరెన్స్ దశరథ రామిరెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ రాంప్రసాద్, సురేష్‌రెడ్డి, నాగసునీల్, బాలకృష్ణం రాజు, రవీంద్రారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, కిరణ్, రవికుమార్, బలరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో ఆగిపోయిన గూడ్స్...పలు రైళ్లకు అంతరాయం

రేణిగుంట మార్చి 4 ప్రభాతవార్త : రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలోని నార్త్ క్యాబిన్ వద్ద ఓ గూడ్స్ రైలు ఇంజన్లో సాంకేతిక లోపం వల్ల ఆగిపోయింది. దీంతో పలు రైళ్ళు ఆలస్యంగా నడిచాయి. రైల్వే ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సాంకేతి సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలం చేరుకొని వేరొక ఇంజన్ సాయంతో రైలును రైల్వే స్టేషన్ గూడ్స్ యార్డ్ కు తరలించారు. ఈక్రమంలో రాయలసీమ, హౌరా ఎక్స్రెస్లు ఆలస్యంగా నడిచినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

చంద్రప్రభ వాహనంలో కలియుగదైవం దివ్యదర్శనం

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో వెలసిన టిటిడి ఆలయానికి సంబంధించిన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగు తున్న బ్రహ్మోత్సవాల్లో మంగళవారం చంద్రప్రభ వాహనంలో తన దివ్యదర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో బ్రహ్మోత్స వాలు జరుగుతున్నాయి. ఈ ఆలయంలో బ్రహ్మోత్స వాలంటే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సంబరాలే. తిరుమల వెళ్ళలేని భక్తులు ఇటీవల కాలంలో తొండమాన్‌పురానికి వెళుతున్నారు. ఇక్కడ స్వామి ప్రసన్న వదనుడుగా దర్శనమిస్తున్నారు. అయితే ఈ ఆలయం జాతీయ రహదారి పక్కనే ఉన్నా ఎందుకో టిటిడి ప్రచారంలో వెనుకబడ్డారు. మంగళవారం స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవాల్లో చంద్రప్రభ వాహనంలో దర్శనమిచ్చారు. ఉత్సవం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మ వార్లను చక్కగా అలంకారం జరిపి గ్రామోత్సవానికి సిద్ధం చేసి వాహనంలో ప్రతిష్టించారు. మేళ తాళాలు మంగళ వాయిద్యాలు వేద పండితుల వేద మంత్రాలతో గ్రామోత్సవం సాగింది.ఉత్సవంతో పాటు అర్చకులు రమణాచార్యులు, బాబు, కృష్ణ, జయకుమార్, గోపి, మాధవాచార్యులు తదితరులు పాల్గొన్నారు. సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్‌రెడ్డి, కందాటి శేఖర్‌రెడ్డి సర్పంచ్ బర్రె హేమభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు

చిత్తూరు రూరల్, మార్చి 4 ప్రభాతవార్త:ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, కార్మికశాఖ అసిస్టెంట్ కమీషనర్ ఓంకార్, గ్రావిటా ఇండియా లిమిటెడ్ జిఎం టాటా శర్మతో కలిసి హెల్మెట్లను పంపిణీ చేసి హెల్మెట్ల వాడకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. గ్రావిటా ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, ఇతరులకు సుమారు 250 మందిక